క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదిక్పై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రంగనాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

వెంకన్న సన్నిధిలో శ్రీనివాస కల్యాణం



వెంకన్నకు ప్రత్యేక పూజలు జరుపుతున్న వేదపండితులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి పైనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస్య దీక్షలో భాగంగా శ్రీనివాస కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పన్న సన్నిధిలో కాకినాడ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుకు ప్రసాదం అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తర పూజ జరిపి, వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంని సూపరింటెండెంట్ అందించారు.

సీయాంక్ ఫార్మాకు స్వచ్ఛాంధ్ర పురస్కారం



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీయాంక్ ఫార్మా అధినేత సుబ్బారావు

పరవాడ: విశాఖ ఫార్మాసిటీలోని సీయాంక్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ స్వచ్ఛ ఇండస్ట్రీస్ కేటగిరీలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును పొందింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ అధినేత జె.సుబ్బారావు అందుకున్నారు.

వరిలో తెగుళ్లు.. సస్యరక్షణ చర్యలే మేలు

సబ్బవరం మండలంలో ఆకుమడులు, నాట్ల సమయంలో ఇబ్బంది పెట్టిన వర్షాలు ఆ తర్వాతి నుంచి విజృంభిస్తున్నాయి. పచ్చగా, ఏపుగా ఎదిగిన వరి చేలను చూసి ఆనందపడాలో.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడ తెగుళ్ల ఉధృతి పెరుగుతుందోనని భయపడాలో తెలియని పరిస్థితి రైతన్నది. దీంతో ముందస్తు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే పంట దిగుబడిని సంరక్షించుకోవచ్చని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వర్షాలతో మరింత ఉధృతమయ్యే ప్రమాదం
- మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులతో తీవ్ర నష్టం
- వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మేలు





అసకపల్లిలో వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తదితరులు (ఇన్‌సెట్) తెగులు సోకిన వరి పంట

సబ్బవరం: మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,358 హెక్టార్లు. అయితే సీజన్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 1,300 హెక్టార్ల వరకు రైతులు వరి నాట్లు వేసుకున్నారు. ప్రస్తుతం తరచూ వర్షాలు కురుస్తుండటం, అది కూడా సాధారణం కంటే అధికంగా ఉండటంతో తెగుళ్ల బెడద పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్న వరి క్షేత్రాల్లో మోతాదు మేరకు సస్యరక్షణ చర్యల ద్వారా రసాయన మందుల వినియోగం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న తెగుళ్లు

ప్రస్తుతం మండలంలోని సబ్బవరం, అమృతపురం ,మల్లునాయుడుపాలెం, బోదువలస తదితర గ్రామాల్లో వరి పంటలో ఆకు ముడత, పొడ తెగులు, సుడి దోమ కనిపిస్తోంది. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- ఆకుముడత నివారణకు ఎసిఫేట్/కార్టాప్ హైడ్రాక్లోరైడ్ మందును లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేయాలి
- పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిలీ/ప్రోపికొనజోల్ 1 మిలీ/వాలిడామైసిన్ 2 మిలీ మందును లీటర్ నీటికి చేర్చి పంటపై పిచికారీ చేసుకోవాలి.
- మండలంలోని వరిక్షేత్రాల్లో సుడి దోమ ప్రభావం ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5ను 2.2 మిలీ/ ఎసిఫేట్ 1.5 గ్రా/పైమెట్రిజన్ రసాయనాలను పిచికారీ చేయాలి.
- కాండం తొలిచే పురుగు సోకితే పిలకలు చనిపోతాయి. వెన్నులు తెల్ల కంకులుగా మారతాయి. దీని నివారణకు క్లోరోఫైరిపాస్ 2.5 మిలీ/మోనోక్రోటోపాస్ 1.6 మిలీ/ఎసిఫేట్ 1.5 గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

యాజమాన్య సంరక్షణ చర్యలు

వరి పంట సంరక్షణకు నాట్ల సమయం నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. తెగుళ్ల ఉధృతిపై వ్యవసాయ నిపుణులు రైతులను అప్రమత్తం చేస్తూ, సస్యరక్షణ చర్యల్ని ఎప్పటికప్పుడు సూచిస్తున్నారు. ఆరోగ్య కరమైన విత్తనాల వాడకం, సమతుల్య ఎరువుల వినియోగం, సమయానుకూలంగా నీటిని అందించడం, వ్యాధి నిరోధక వంగడాల ఎంపిక తదితర చర్యలు తెగుళ్ల నియంత్రణకు ఎంతగానో దోహదం చేస్తాయని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తప్పనిసరి అయినా.. వ్యవసాయ అధికారుల సిఫార్స్ చేసిన మోతాదులోనే ఉండాలి. లేకుంటే పంటతోపాటు, పర్యావరణానికీ నష్టం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలైన దిగుబడి



ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండటంతో వరి క్షేత్రాల్లో తెగుళ్ల తాకిడిపై కాస్త దృష్టిపెట్టాలి. పలు గ్రామాల్లో అక్కడక్కడ ఆకుముడత, పొడ తెగులు, సుడి దోమ తెగులు కనిపిస్తున్నాయి. ముందస్తు సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల ఉధృతిని నియంత్రించవచ్చు. రసాయనిక ఎరువులను, క్రిమి సంహారక మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వల్ల పంటకు కీడే ఎక్కువ.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం



కోన రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

పరవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్‌లు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.05 లక్షల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న దాత అప్పలస్వామీజీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి వేపగుంటకు చెందిన కోరెడ్డి అప్పలస్వామీజీ అనే దాత రూ.లక్షా 5 వేల 116 విరాళాన్ని సోమవారం అందజేశారు. సంబంధిత చెక్కును పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీప్రసన్నకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంని ఆలయ అధికారులు అందించారు.

‘మరిడిమాంబ ఆలయ స్థలాన్ని కాపాడండి’

సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ స్థలాన్ని అక్రమించే క్రమంలో వివాదానికి దిగుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్మాణ స్థల దాతలు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ చిన్నికృష్ణకు ఆయన కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాలు.. మరిడిమాంబ ఆలయానికి గొటివాడ రెవెన్యూ పరిధి సర్వే నెం .275–1లో 30 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన చింతలపాటి సత్యనారాయణరాజు దానమిచ్చారు. సత్యనారాయణరాజు చిన్నాన్న చింతలపాటి తమ్మిరాజుకు వారసులు లేకపోవడంతో ఆయన నుంచి వారసత్వంగా దఖలుపడింది. సత్యనారాయణ రాజు తదనంతరం ఆయన భార్య వరహాలమ్మ పేరిట రికార్డుల్లో ఖాతా నెం.625తో నమోదయింది. సదరు భూమిని గ్రామస్తుల సమక్షంలో గ్రామ దేవతకు సత్యనారాయణరాజు ఇచ్ఛాపూర్వకంగా అందించారు. దాదాపు 2 దశాబ్దాలకు పైగా ఆ స్థలాన్ని అమ్మవారి దేవాలయ అవసరాలకు వినియోగిస్తున్నారు.



తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు

అయితే అదే గ్రామానికి చెంది, గతంలో జిల్లా సర్వేయర్‌గా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు రికార్డులను తారుమారు చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీన్ని ఆధారంగా చేసుకుని సుబ్బారావు సోదరుడు అచ్యుతం భార్య దువ్వూరి లలిత స్థలంపై వివాదం రేపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా, సాంఘికంగా బలమైనవారు కావడంతో గ్రామస్తులను, ఆలయ కమిటీ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని భూమిని గ్రామ దేవత ఆలయానికి కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బి.సత్యారావు, ఎస్.సూరిబాబు, విరోతి చినఅప్పలనాయుడు, కె.పరమేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, విరోతి రామారావు, జి.గణేష్, ఇ.సింహాచలం, ఎస్‌వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదుల వెల్లువ

పెందుర్తి: వేపగుంట జోన్–8 జీవీఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. జోనల్ కమిషనర్ శంకర్రావు పాల్గొని వినతులు, ఫిర్యాదుల్ని స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందించారు. అడవివరం ఏరియాలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దని స్థానికులు కోరారు. చినముషిడివాడ ప్రాంతంలో రహదారుల సమస్య పట్టిపీడిస్తోందని, అవసరమైన ప్రదేశాల్లో రోడ్లను నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. పెందుర్తి దరి కృష్ణానగర్ ఏరియాలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, చింతల అగ్రహారంలో 80 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రశాంతి నగర్‌లో రోడ్డు నిర్మించాలని, గోపాలపట్నం దరి శ్రీరాంనగర్‌లో అక్రమ నిర్మాణాలను ఆపాలని అర్జీలు దాఖలు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్సీకి ఫిర్యాదు చేశారు.



వినతులను పరిశీలిస్తున్న జెడ్సీ శంకర్రావు

గుంతల రోడ్డుతో ప్రజల ఇబ్బందులు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో పలు చోట్ల ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాహాలు కూడలి, సబ్‌స్టేషన్ కూడలి, ఊటగెడ్డ కూడలి, మండల కాంప్లెక్స్ కూడళ్లలో ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, వివిధ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ముందే ఇరుకు రోడ్డు, ఆపై భారీ గుంతలు, అంతంతమాత్రంగా వెలుగుతున్న వీధి దీపాలతో చీకటి పడితే రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పునరుద్ధరణ చర్యలు చేపట్టకపోయినా.. కనీసం మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.



సినిమాహాలు కూడలిలో ఏర్పడిన భారీ గుంతలు

మరమ్మతులతో ఆర్వో ప్లాంట్.. తాగునీటికి ఇక్కట్లు

పరవాడ: మండలంలో ముత్యాలమ్మపాలెం గంగపుత్రుల సౌకర్యార్థం సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం కిలో మీటర్ల మేర పక్క గ్రామాలకు పరుగు తీయాల్సి వస్తోంది. 2016లో గంగపుత్రుల కోసం సీఎస్సార్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి దీన్ని ఎన్టీపీసీ ఏర్పాటు చేసింది. కొంత కాలం సక్రమంగా పనిచేసిన ప్లాంట్‌కు మరమ్మతులు రావడంతో మూలకు చేరింది. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో బోర్ల నుంచి వచ్చే నీరు తాగేందుకు పనికిరాకపోవడంతో ఆర్వో ప్లాంట్ నీటితో దాహం తీర్చుకునే వారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ మూతపడడంతో 3 కి.మీ. దూరంలోని వాడచీపురుపల్లి, దీపాంజలినగర్ ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోందని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం ప్రజలు వాపోతున్నారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకురావాలని నీటి సరఫరా విభాగం అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.



ముత్యాలమ్మపాలెంలో రిపేర్లతో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

చిరువ్యాపారుల్ని కాపాడేలా చూడాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ముత్యమాంబ చిరువ్యాపారుల సంఘం ప్రతినిధులు

పెందుర్తి: విశాఖ నగరంలో చిరువ్యాపారుల పొట్ట కొట్టిన జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకుల వేధింపుల నుంచి తమను కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ముత్యమాంబ చిరువ్యాపారుల సంఘం(జోన్ 8 కమిటీ) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్‌లకు సోమవారం నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వినతిపత్రం అందించారు. హాకర్స్ జోన్ ఏర్పాటు చేసేవరకు చిరువ్యాపారులు నడుపుకొంటున్న వ్యాపారాలను కొనసాగేలా చూడాలని ఆ వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వ అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో 93, 94 వార్డు కమిటీల ప్రతినిధులు ఉన్నారు.

మళ్లీ మూలకు చేరిన లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ మళ్లీ మరమ్మతులకు గురైంది. నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడంతో నిర్వహణ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో ప్లాట్‌ఫారం వైపు ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ ప్రారంభం నుంచి మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల నుంచి లిఫ్ట్ నిర్వహణ పనులు చేపడుతున్నామని నోటీస్ అతికించి ఉంచడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, లగేజీలతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.



మరమ్మతులకు గురైన లిఫ్ట్

ప్రజావసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్

విశాఖ సిటీ: ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మాస్టర్‌ప్లాన్–2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ నుంచి వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమయ్యేలా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామన్నారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

గో బ్యాక్ అంబుజా

- ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను అడ్డుకున్న వైనం

పెదగంట్యాడ: అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఈ నెల 8న జీవీఎంసీ మైదానంలో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు చేస్తున్న ఏర్పాట్లను వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులుగొందేశి శ్రీనివాసరెడ్డి, మంత్రి శంకర నారాయణ స్థానికులతో కలసి అడ్డుకున్నారు. గో బ్యాక్ అంబుజా అంటూ నినాదాలు చేశారు. ఇప్పటికే గంగవరం పోర్టు ద్వారా వచ్చే కాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని.. ఈ ఫ్యాక్టరీ పెడితే స్థానికుల ఆరోగ్యానికి మరింత హాని కలుగుతుందన్నారు. పరిశ్రమ ప్రతిపాదనను వెనక్కి తీసుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కిల్లాన ముసలయ్య, పిట్ట గురునాథ్ రెడ్డి, బసా అప్పలరెడ్డి, సింహాద్రి, నీలాపు అప్పన్న పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

అప్పన్న దేవస్థానం ఉద్యోగిపై భక్తుడి ఫిర్యాదు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగిపై ఓ భక్తుడు సోమవారం ఫిర్యాదు చేశారు. ఏయూలో ఉద్యోగం చేస్తున్న పి.మంగరాజు ఆరుగురు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనానికి వచ్చారు. రూ.300 టిక్కెట్లు తీసుకున్నారు. అయితే నీలాద్రిగుమ్మం వద్ద ఎస్.రమేష్ అనే ఉద్యోగి సీనియర్ సిటిజన్ అయిన తన తండ్రి, కుటుంబ సభ్యులపట్ల దౌర్జన్యంగా ప్రవర్తించడం బాధ కలిగించిందని మంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెదగంట్యాడ: యారాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారు.ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 4న ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్ అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. అండర్–17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి వనం పరిపూర్ణ, అండర్– 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని బంక అఖిల అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం అప్పారావు, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, సిబ్బంది

అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణం ఆపాలి

డాబాగార్డెన్స్: గాజువాకలోని పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య అదానీ సంస్థ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానించేందుకు వెంటనే సమావేశం నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందన్నారు. అదానీ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం సమీప ప్రాంతాలు మొత్తం ప్రమాదకరమైన దుమ్మూ, ధూళి, విషకణాలతో నిండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు కాలుష్యమవుతుందని, ప్రజలు అనేక ప్రాణాపాయ జబ్బులకు గురవుతారని పేర్కొన్నారు. జీవీఎంసీకి సరఫరా అయ్యే తాగునీరు, ఏలేరు కెనాల్, నీటి రిజర్వాయర్లు కలుషితమై, విషపూరితంగా మారే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. మీనమేషాలు లెక్కించకుండా, ఎటువంటి జాప్యానికి ఆస్కారం లేకుండా తక్షణమే జీవీఎంసీ కౌన్సిల్, రాజకీయ పక్షాల ఫ్లోర్ లీడర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని గంగారావు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. నగర ప్రథమ పౌరుడిగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఆరిపాకకు ఉత్తమ పంచాయతీ పురస్కారం



అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో ఉత్తమ పంచాయతీ పురస్కారం వరించింది. పంచాయతీ పరిధి పారిశుధ్య నిర్వాహణలో ఈ పురస్కారం లభించడంతో జిల్లా కేంద్రం అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా సోమవారం ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, పంచాయతీ కార్యదర్శి పైడిరాజుతో పాటు గ్రీన్ గార్డ్ హరి పాల్గొని అవార్డును అందుకున్నారు. సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆధ్వర్యంలో మౌలికవసతుల కల్పన విభాగంలో గతంలో కూడా ఉత్తమ పంచాయతీ అవార్డును పొందారు.